వర్ధన్నపేట మున్సిపాలిటీ
కాంగ్రెస్ కైవసం

అనుక్షణం ప్రజల పక్షం

RNI NO: TELTEL/2023/87607

జర్నలిస్ట్ వార్త

తెలుగు దిన పత్రిక..

WANTED
రిపోర్టర్లు కావలెను
జర్నలిస్ట్ వార్త
దిన పత్రికలో పని చేయుటకు
తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని
అన్ని జిల్లా,మండల,కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను
జర్నలిస్ట్ వార్త
JV NEWS
ఎడిటర్: బిర్రు కరుణాకర్
Cell:9701249103

సంపుటి - 2 సంచిక - 291 మంగళవారం17 ఫిబ్రవరి 2026 ఎడిటర్ : బిర్రు కరుణాకర్ పేజిలు -5 వెల - 5/-

Published From Warangal : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

"గ్రేట్ వర్క్"

ఏపీ ప్రభుత్వంపై బిల్ గేట్స్ ప్రశంసలు

పౌరసేవల తీరు ప్రశంశనీయం

డేటా సంరక్షణ తదితర అంశాలపై ఆరా

ఆర్టీజీఎస్‌ను బాబుతో కలసి సందర్శించిన గేట్

టెక్నాలజీ ఆధారిత సేవలపై బాబు వివరణ



అమరావతి, **ఫిబ్రవరి 16 / (జర్నలిస్ట్ వార్త)::** డేటా లేక్, వాట్సప్ గవర్నెన్స్ ద్వారా పౌర సేవల్ని సులభతరం చేయడం బాగుందని ఫౌండేషన్ వ్యవస్థాపక ఛైర్మన్ బిల్‌గేట్స్ అభినందించారు. ఆంధ్రప్రదేశ్ అనుసరిస్తున్న విధానాలను పరిశీలించిన గేట్స్ చంద్రబాబును ప్రశసించారు. రాజధానిలో 30 శాతం గ్రీన్ అండ్ బ్లూ ప్రణాళిక బాగుందంటూ బిల్ గేట్స్ వ్యాఖ్యానించారు. రాజధాని నిర్మాణ తీరును ముఖ్యమంత్రి చంద్రబాబు వివరించగా.. 'గ్రేట్ వర్క్' అంటూ బిల్ గేట్స్ కితాబిచ్చారు.ఆంధ్రప్రదేశ్ పర్యటనలో ఉన్న బిల్‌గేట్స్ ముఖ్యమంత్రి చంద్రబాబుతో కలిసి సచివాలయంలోని రియల్‌టైమ్ గవర్నెన్స్ కమాండ్ సెంటర్‌ను సోమవారం సందర్శించారు. ఆర్టీజీఎస్ కేంద్రం నుంచి పాలనలో టెక్నాలజీ వినియోగాన్ని దగ్గరుండి పరిశీలించారు. రియల్ టైమ్ గవర్నెన్స్ ద్వారా పౌర సేవల్ని వేగంగామిగతా 2లో...

మానవాళి పురోగతికి ఏఐ

ఢిల్లీలో ప్రారంభమైన 'ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్'

80 దేశాల ప్రతినిధులు, 500 మందికి పైగా ఏఐ నిపుణుల హాజరు

ఫిబ్రవరి 19న ప్రధాని మోదీ చేతుల మీదుగా ప్రారంభోత్సవ ప్రసంగం

గ్లోబల్ సౌత్‌లో ఈ స్థాయిలో ఏఐపై సదస్సు జరగడం ఇదే ప్రప్రథమం

ఏఐ ఛాలెంజ్‌ల ఫైనలిస్టులు తమ ఆవిష్కరణలను ప్రదర్శించనున్నారు

ఢిల్లీ **ఫిబ్రవరి 16 / (జర్నలిస్ట్ వార్త):** దేశ రాజధాని ఢిల్లీ వేదికగా 'ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ 2026' సోమవారం ఘనంగా ప్రారంభమైంది. ఈ సదస్సులో 80కి పైగా దేశాల నేతలు, 500 మందికి పైగా గ్లోబల్ ఏఐ నిపుణులు, సీఈఓలు, పరిశోధకులు పాల్గొంటున్నారు. సమ్మిళిత వృద్ధి, సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనలో కృత్రిమ మేధ (ఏఐ) పాత్రపై ఈ సదస్సులో ప్రధానంగా చర్చిస్తారు. గ్లోబల్ సౌత్‌లో ఈ స్థాయిలో ఏఐపై సదస్సు జరగడం ఇదే ప్రప్రథమం కావడం విశేషం.మిగతా 2లో...

జేఈఈ మెయిన్స్ ఫలితాలు విడుదల..

ముగ్గురు తెలుగు విద్యార్థులకు 100 పర్సంటైల్

దేశవ్యాప్తంగా 12 మందికి 100 పర్సంటైల్ స్కోర్

టాపర్లలో ఏపీ నుంచి ఇద్దరు, తెలంగాణ నుంచి ఒకరు

మహిళా టాపర్‌గా 99.99 పర్సంటైల్‌తో హర్యానా అమ్మాయి

ఏప్రిల్‌లో రెండో సెషన్ పరీక్షకు అవకాశం

ఢిల్లీ **ఫిబ్రవరి 16 / (జర్నలిస్ట్ వార్త):** దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థులు ఎంతో ఉత్కంఠగా ఎదురుచూస్తున్న జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్ (జేఈఈ) మెయిన్స్ 2026 జనవరి సెషన్ ఫలితాల్లో తెలుగు విద్యార్థులు తమ సత్తాను మరోసారి చాటారు. జాతీయ పరీక్షల మండలి సోమవారం విడుదల మిగతా 2లో...

ఏపీలో విలీనమైన 5 గ్రామాలను తిరిగివ్వండి

సీఎం చంద్రబాబు ముందు తుమ్మల కీలక ప్రతిపాదనలు

సరిహద్దుల్లోని సాగునీటి ప్రాజెక్టుల నిర్వహణపై కీలక చర్చలు

రెండు రాష్ట్రాల మధ్య సహకారంతో సమస్యలు పరిష్కరించుకోవాలని నిర్ణయం

అమరావతి, **ఫిబ్రవరి 16 / (జర్నలిస్ట్ వార్త):** తెలుగు రాష్ట్రాల మధ్య నెలకొన్న సరిహద్దు సమస్యల పరిష్కారం దిశగా కీలక పరిణామం చోటుచేసుకుంది. తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సోమవారం ఉండవల్లిలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబుతో సమావేశమయ్యారు. ఈ భేటీలో రెండు రాష్ట్రాల మధ్య సమన్వయంతో పరిష్కరించుకోవాల్సిన పలు మిగతా 2లో...

కేంద్ర నిధులపై దృష్టి పెట్టండి

అధికారులకు సిఎస్ ఆదేశాలు

హైదరాబాద్,**ఫిబ్రవరి 16 / (జర్నలిస్ట్ వార్త):** కేంద్ర ప్రభుత్వం నుండి రావాల్సిన నిధులను రాబట్టుకునేందుకు తగిన కార్యాచరణను రూపొందించుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు ఉన్నతాధికారులను ఆదేశించారు. సోమవారం డా.బి.ఆర్.అంబేద్కర్ సచివాలయంలో వివిధ విభాగాల కార్యదర్శులు, ముఖ్య కార్యదర్శులతో ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం జరిగింది.మిగతా 2లో...

రైతులకు ప్రభుత్వం తీపి కబురు

సన్నవడ్ల బకాయిలు

రూ.514.36 కోట్లు

విడుదల

యుద్ధ నౌకల విన్యాసాలు

విశాఖలో అంతర్జాతీయ నౌకాదళ ఉత్సవాలు

50 దేశాలు, 70 యుద్ధనౌకలతో మెగా వేడుకలు

పది రోజుల పాటు కొనసాగనున్న వేడుకలు

18న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము రాక

ఏడింట 5 కార్పొరేషన్‌లు కాంగ్రెస్ కైవసం..

11 మున్సిపాలిటీల్లో ఎన్నిక వాయిదా

రామగుండం, నిజామాబాద్, మహబూబ్ నగర్, మంచిర్యాల, నల్గొండలను దక్కించుకున్న కాంగ్రెస్

కరీంనగర్‌లో బీజేపీ, కొత్తగూడెంలో సీపీఐ విజయం

జనగాం, తొర్రూర్, క్యాతనపల్లి, జహీరాబాద్ మున్సిపాలిటీల్లో ఎన్నిక వాయిదా

హైదరాబాద్ **ఫిబ్రవరి 16 / (జర్నలిస్ట్ వార్త):** మున్సిపల్ పాలక మండలి ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీ జోరు కొనసాగింది. మేయర్, డిప్యూటీ మేయర్, ఛైర్మన్, వైస్ ఛైర్మన్ ఎన్నికల్లో సత్తా చాటింది.మొత్తం 116 మున్సిపాల్టీల్లో కోరం లేక 11 మున్సిపాల్టీల్లో ఎన్నిక మంగళవారానికి వాయిదా పడింది. మిగిలిన 105 మున్సిపాల్టీల్లో మేయర్, డిప్యూటీ మేయర్, ఛైర్మన్, వైస్ ఛైర్మన్ ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యింది. ఈ సందర్భంగా హంగ్ ఏర్పడిన మున్సిపాల్టీల్లో రాజకీయ పరిణామాలు వేగంగా మారిపోయాయి. మొత్తం 36 మున్సిపాల్టీల్లో హంగ్ ఏర్పడగా, 11 చోట్ల ఎన్నిక వాయిదా పడింది.మిగతా 2లో...



విశాఖలో అంతర్జాతీయ నౌకాదళ ఉత్సవాలు

ఫిబ్రవరి 16 / (జర్నలిస్ట్ వార్త): భారత నౌకాదళం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే 'అంతర్జాతీయ నౌకాదళ సమీక్ష' నిన్న విశాఖపట్నంలో ఘనంగా ప్రారంభమైంది. మన దేశంలో మూడోసారి జరుగుతున్న ఈ మెగా ఈవెంట్‌కు విశాఖపట్నం రెండోసారి వేదిక అయింది. 2016లో జరిగిన తర్వాత మరోసారి 2026లోనూ విశాఖనే ఎంపిక చేయడం ద్వారా నగర ప్రాధాన్యతను భారత నౌకాదళం మరోసారి చాటిచెప్పింది. ఈ వేడుకలు ఫిబ్రవరి 25 వరకు పది రోజుల పాటు కొనసాగనున్నాయి. ఈ కార్యక్రమాల్లో సుమారు 50 దేశాల నుంచి 4,000 మంది అతిథులు, 70కి పైగా అత్యాధునిక యుద్ధనౌకలు పాల్గొంటున్నట్లు అధికారులు తెలిపారు. ఈ పది రోజులు విశాఖ నగరం నేవీ సిబ్బంది సందడి, యుద్ధనౌకల వెలుగులతో ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. ఈసారి ఉత్సవాలు కేవలం పరిమితం కాకుండా మూడు ప్రధాన కార్యక్రమాల సమాహారంగా నిర్వహిస్తున్నారు. IF=తో పాటు ప్రతి రెండేళ్లకోసారి జరిగే 'మిలాన్' మల్టీలాటరల్ నేవల్ ఎక్సర్‌సైజెస్, అలాగే ఇండియన్ ఓషన్ నేవల్ సింపోజియం (ఐఓఎన్ఎస్) కార్యక్రమాలు కూడా విశాఖలోనే జరగనున్నాయి. దీంతో హిందూ మహాసముద్ర పరీవాహక దేశాలు, ప్రపంచవ్యాప్తంగా ఉన్న మిత్రదేశాలతో సముద్ర భద్రత, పరస్పర సహకారం అంశాలపై కీలక చర్చలు జరగనున్నాయి. నిన్న సాయంత్రం 'మిలాన్' పేరుతో ప్రత్యేక గ్రామాన్ని ప్రారంభించడం ద్వారా ఈ ఉత్సవాలకు అంకురార్పణ చేశారు. ఈ గ్రామంలో భారతదేశంలోని అన్ని రాష్ట్రాల సంస్కృతీ సంప్రదాయాలను ప్రతిబింబించేలా స్టాల్స్ ఏర్పాటు చేయగా.. విదేశీ అతిథులకు ఇది 'మినీ ఇండియా'గా కనిపిస్తోంది. కాగా, ఫిబ్రవరి 18న రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము యుద్ధనౌకలను సమీక్షించనున్నారు. ఫిబ్రవరి 19న ఆర్‌కే బీచ్‌లో నిర్వహించే 'ఇంటర్నేషనల్ సిటీ పరేడ్' అత్యంత వైభవంగా జరగనుంది. ఈ పరేడ్‌కు సీఎం నారా చంద్రబాబు నాయుడు హాజరుకానున్నారు. అలాగే ఫిబ్రవరి 21 నుంచి 25 వరకు సముద్రంలో జరగనున్న యుద్ధ విన్యాసాలు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి. గతంలో అండమాన్‌కు పరిమితమైన 'మిలాన్' విన్యాసాలను ఈసారి మెరుగైన మౌలిక వసతుల దృష్ట్యా విశాఖకు మార్చడం పర్యాటక రంగానికి ఊతమిస్తుందని భావిస్తున్నారు. ఈ కార్యక్రమాల ద్వారా భారత నౌకాదళ శక్తిసామర్థ్యాలు ప్రపంచానికి చాటిచెప్పడమే కాకుండా, వివిధ దేశాల యుద్ధనౌకలు, జలాంతర్గాములను దగ్గర నుంచి చూసే అరుదైన అవకాశం ప్రజలకు లభించనుంది.

"గ్రేట్ వర్క్"

(మొదటి పేజీ తరువాయి)

అందిస్తున్న తీరు, ఫలితాలను గేట్స్‌కు ఈ సందర్భంగా చంద్రబాబు వివరించారు. డేటాలేక్, అవేర్ 2.0, వాట్సప్ గవర్నెన్స్, సంజీవని ప్రాజెక్టు, రాజధాని అమరావతి ప్రాజెక్టుల గురించి బిల్‌గేట్స్ తెలుసుకున్నారు. ఆర్టీజీఎస్‌లోని డిస్‌ప్లే వాల్స్‌పై ప్రజంటేషన్లను పరిశీలించారు. డేటా లేక్ ద్వారా అన్ని ప్రభుత్వ శాఖలను అనుసంధానిం చామని సీఎం వివరించారు. డేటా లేక్, వాట్సప్ గవర్నెన్స్ ద్వారా పౌర సేవల్ని సులభతరం చేయడం బాగుందని ఈ సందర్భంగా బిల్‌గేట్స్ కితాబిచ్చారు. అవేర్ 2.0 ద్వారా రియల్ టైమ్‌లో సమాచారాన్ని సేకరించి, వేగంగా నిర్ణయాలు తీసుకుంటున్నట్టు గేట్స్‌కు సీఎం చంద్రబాబు తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, పాలసీల అమలుపై ప్రజాభిప్రాయం సేకరిస్తున్న తీరునూ పరిశీలించారు. కీ పర్ఫార్మెన్స్ ఇండికేటర్స్ ద్వారా జీఎస్డీపీ పెరుగుదలను ఎప్పటికప్పుడు అంచనా వేస్తున్నట్టు తెలిపారు. ప్రాపర్టీ రికార్డుల భద్రతకు ఎలాంటి జాగ్రత్తలు తీసుకుంటున్నారని బిల్‌గేట్స్ ప్రశ్నించగా.. బ్లాక్ చెయిన్ టెక్నాలజీతో ల్యాండ్ రికార్డులు భద్రపరుస్తున్నామని, భూ రికార్డులపై క్యూఆర్ కోడ్ వంటి విధానాలతో పారదర్శకంగా ఉండేలా చర్యలు తీసుకున్నామని అధికారులు వివరించారు. గేట్స్ ఫౌండేషన్ సహకారంతో చిత్తూరు జిల్లాలో కొనసాగుతున్న సంజీవని ప్రాజెక్టు అమలు గురించి కూడా ఈ సందర్భంగా బిల్‌గేట్స్ ఆరా తీశారు. బ్లడ్ ప్రెషర్, డయాబెటిస్ లాంటి పరీక్షల వివరాలను ఎలా నమోదు చేస్తున్నారో అడిగి తెలుసుకున్నారు. కుప్పంలో అమలు చేసిన సంజీవని ప్రాజెక్టు చాలా చక్కగా ఉందని అభిప్రాయం వ్యక్తం చేస్తూ 'నైస్' అంటూ కొనియాడారు. ప్రజల డిజిటల్ హెల్త్ రికార్డులను అనుసరించి వారి లైఫ్‌స్టైల్, ఆహారం తదితర అంశాల్లో సలహాలు ఇస్తున్నామని అధికారులు తెలిపారు. ఏఐ వినియోగంతో ప్రజారోగ్య సేవలను మరింత మెరుగు పరిచేలా చూస్తున్నామని సీఎం వివరించారు. అందుకు బిల్‌గేట్స్ 'గ్రేట్' అంటూ కితాబిచ్చారు. ప్రజా రాజధాని అమరావతి నిర్మాణ వివరాలనూ బిల్‌గేట్స్ అడిగి తెలుసుకున్నారు. రాజధాని నిర్మాణ తీరును బిల్ గేట్స్‌కు మఖ్యమంత్రి వివరించగా.. గ్రేట్ వర్క్ అంటూ కొనియాడారు.

బిల్‌గేట్స్‌కు ఆహ్వానం పలకడం ఆనందం

పలు రంగాల్లో ఆయనతో చర్చిస్తున్నాం

ఎక్స్ వేదికగా ఐటిశాఖ మంత్రి లోకేశ్ వెల్లడి

గేట్స్ ఫౌండేషన్ చైర్మన్ బిల్ గేట్స్ ఆంధ్రప్రదేశ్‌లో అడుగుపెట్టారు. ఈ సందర్భంగా సామాజిక మాధ్యమం ఎక్స్‌లో విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్, ఆర్టీజీఎస్ శాఖల మంత్రి నారా లోకేశ్ ఆసక్తికర ట్వీట్ చేశారు. బిల్ గేట్స్‌కు అమరావతి హృదయపూర్వక స్వాగతం పలుకుతోందని ఆయన పేర్కొన్నారు. గన్నవరం విమానాశ్రయంలో బిల్ గేట్స్‌ను సహచర మంత్రులతో కలిసి సాదరంగా స్వాగతించడం ఆనందంగా ఉందని మంత్రి తెలిపారు. గేట్స్ ఫౌండేషన్ చైర్మన్ బిల్ గేట్స్‌తో ఆరోగ్యం, వ్యవసాయం, విద్య, సాంకేతిక ఆధారిత పరిపాలన రంగాల్లో భాగస్వామ్యాలను మరింత బలోపేతం చేసే అంశాలపై సచివాలయంలో చర్చిస్తున్నట్లు లోకేశ్ తెలిపారు. ప్రజలకు పటిష్టమైన, అత్యంత ప్రభావం కలిగించే పరిష్కారాలను అందించేందుకు గేట్స్ ఫౌండేషన్‌తో సన్నిహితంగా పనిచేయడానికి ఆంధ్రప్రదేశ్ ఎదురు చూస్తోందని మంత్రి లోకేశ్ తెలిపారు. గన్నవరం ఎయిర్‌పోర్టులో సహచర మంత్రులు వంగలపూడి అనిత, అచ్చెన్నాయుడు, సత్యకుమార్ యాదవ్‌లతో కలిసి బిల్ గేట్స్‌ను మంత్రి లోకేశ్ స్వాగతించారు.

ఏపీలో విలీనమైన 5 గ్రామాలను తిరిగివ్వండి

(మొదటి పేజీ తరువాయి)

ముఖ్యమైన అంశాలపై చర్చించారు. ముఖ్యంగా, రాష్ట్ర విభజన సమయంలో ఆంధ్రప్రదేశ్‌లో విలీనం చేసిన ఐదు గ్రామ పంచాయతీలను తిరిగి తెలంగాణలో కలపాలని తుమ్మల చంద్రబాబుకు ప్రధానంగా విజ్ఞప్తి చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు సమీపంలో ఉన్న యటపాక, కన్నాయిగూడెం, పిచుకలపాడు, పురుషోత్తపట్నం, గుండాల పంచాయతీలను తెలంగాణకు బదిలీ చేయాలని ఆయన కోరారు. ఈ గ్రామాలు భౌగోళికంగా తెలంగాణ భూభాగంలో ఉన్నప్పటికీ, పరిపాలనపరంగా ఏపీలో ఉండటంతో అక్కడి గిరిజన ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తుమ్మల వివరించారు. జిల్లా కేంద్రాలకు వెళ్లాలంటే గంటల తరబడి ప్రయాణించాల్సి రావడం, అంతర్రాష్ట్ర చెక్‌పోస్టుల సమస్యలు, పరిపాలనాపరమైన ఇబ్బందులను ఆయన చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లారు. భద్రాచలం రామాలయానికి చెందిన కొన్ని భూములు ఏపీ పరిధిలో ఉండటం వల్ల తలెత్తుతున్న సమస్యలను కూడా ప్రస్తావించారు.

ఈ సమావేశంలో మరికొన్ని కీలక ప్రతిపాదనలను కూడా తుమ్మల సీఎం చంద్రబాబు ముందుంచారు. తిరుమలలో తెలంగాణ భక్తుల సౌకర్యార్థం యాత్రికుల భవనం నిర్మించడానికి 5 ఎకరాల భూమిని కేటాయించాలని కోరారు. అలాగే, ఖమ్మం జిల్లాలో టీటీడీ ఆలయ నిర్మాణానికి సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. వీటితో పాటు, ఖమ్మం జిల్లాలోని పెద్దవాగు ప్రాజెక్టు శాశ్వత మరమ్మతుల అంశాన్ని కూడా చర్చించారు. ఈ ప్రాజెక్టు కింద 85 శాతం ఆయకట్టు ఏపీలోనే ఉన్నందున, మరమ్మతుల కోసం అయ్యే రూ.92.20 కోట్ల ఖర్చును 85:15 నిష్పత్తిలో భరించేందుకు అంగీకరించాలని సూచించారు.

ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత తుమ్మల ఆయనతో భేటీ కావడం ఇదే తొలిసారి. కేంద్రంలో ఎన్డీయే ప్రభుత్వంలో చంద్రబాబు కీలక పాత్ర పోషిస్తున్నందున, ఆయన చొరవ తీసుకుంటే దశాబ్దాలుగా ఉన్న ఈ సమస్యలు త్వరగా పరిష్కారమవుతాయని తుమ్మల ఆశాభావం వ్యక్తం చేశారు.

అంబటి కస్టడీ, బెయిల్ పిటిషన్లపై తీర్పు రిజర్వ్

అమరావతి, **ఫిబ్రవరి 16 / (జర్నలిస్ట్ వార్త):**

మాజీ మంత్రి, వైసీపీ నేత అంబటి రాంబాబు దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌తో పాటు పోలీస్ కస్టడీ కోరుతూ దాఖలైన పిటిషన్లపై గుంటూరు ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో విచారణ జరిగింది. ఇరుపక్షాల వాదనలు విన్న కోర్టు తీర్పును 18వ తేదీకి రిజర్వ్ చేసింది.

ఈ కేసు 2023 సంక్రాంతి సంబరాల పేరుతో నిర్వహించిన లక్కీ డ్రా వ్యవహారానికి సంబంధించినది. అంబటి రాంబాబు తరపున పొన్నవోలు సుధాకరరెడ్డి వాదనలు వినిపించారు. తీవ్ర నేరాలు, జీవితఖైదు శిక్షలు పడే కేసుల్లోనే బెయిల్ నిరాకరించాలని ఈ సందర్భంగా పొన్నవోలు అన్నారు. ఏడేళ్లలోపు శిక్ష పడే కేసుల్లో రిమాండ్ అవసరం లేదని చెప్పారు. ఈ కేసులో రెండేళ్లలోపు శిక్ష విధించే సెక్షన్లు మాత్రమే ఉన్నాయి కాబట్టి కస్టడీ అవసరం లేదని... బెయిల్ మంజూరు చేయాలని కోర్టును కోరారు.

పోలీసుల తరపున న్యాయవాది తన వాదనలు వినిపిస్తూ... అంబటి రాంబాబు లాటరీ పేరుతో డబ్బులు వసూలు చేసి మోసం చేశారని... పూర్తి స్థాయి విచారణ కోసం పోలీస్ కస్టడీ అవసరమని కోర్టును కోరారు. ఇరు పక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి బెయిల్, పోలీస్ కస్టడీ పిటిషన్లపై తీర్పును రిజర్వ్ చేశారు. ఈ కేసులో కోర్టు ఏ నిర్ణయం తీసుకుంటుందన్నది రాజకీయ వర్గాల్లో ఆసక్తిగా మారింది.

రైతులకు ప్రభుత్వం తీపి కబురు

సన్నవడ్ల బకాయిలు రూ.514.36 కోట్లు విడుదల

హైదరాబాద్, **ఫిబ్రవరి 16 / (జర్నలిస్ట్ వార్త):**ధాన్యం రైతులకు తెలంగాణ ప్రభుత్వం తీపి కబురు అందించింది. ఖరీఫ్‌లో సన్న వడ్లు కొనుగోలుకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న బోనస్ బకాయిలను క్లియర్ చేస్తూ రూ.514.36 కోట్ల నిధులను విడుదల చేసింది. క్వింటల్‌కు రూ.500 చొప్పున బోనస్ రూపంలో రైతుల ఖాతాల్లో నేరుగా జమ కానున్నాయి. దీని ద్వారా సుమారు 2.17 లక్షల మంది రైతులు నేరుగా లబ్ది పొందనున్నారు. ఇప్పటి వరకు రాష్ట్ర ప్రభుత్వం రైతులకు మొత్తం 1,939.58 కోట్ల రూపాయల బోనస్‌ను చెల్లించింది. రాష్ట్రంలో సన్న బియ్యం సాగును ప్రోత్సహించడం, రైతులకు మెరుగైన గిట్టుబాటు ధర అందించడమే ప్రభుత్వ లక్ష్యమని అధికారులు తెలిపారు. ల్గ÷తుల సంక్షేమమే ప్రాధాన్యంగా .. ధాన్యం కొనుగోళ్లు, బోనస్ చెల్లింపులు, ఎమ్ఎస్‌పీతో పాటు అదనపు ప్రోత్సాహకాలను రాష్ట్ర ప్రభుత్వం అందిస్తోంది. ఈ నిధుల విడుదలతో పెండింగ్ బకాయిలు దాదాపు పూర్తిగా క్లియర్ అయ్యే అవకాశం ఉంది. రైతులు తమ బ్యాంక్ ఖాతాలను చెక్ చేసుకోవాలని, ఏవైనా సమస్యలు ఉంటే సంబంధిత కొనుగోలు కేంద్రాలు, సివిల్ సప్లైస్ శాఖను సంప్రదించాలని అధికారులు సూచించారు. పెండింగ్ బకాయిలు విడుదలతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

జేఈఈ మెయిన్స్ ఫలితాలు విడుదల..

(మొదటి పేజీ తరువాయి)

చేసిన ఈ ఫలితాల్లో దేశవ్యాప్తంగా 100 పర్సంటైల్ సాధించిన 12 మంది టాపర్ల జాబితాలో ముగ్గురు తెలుగు రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు స్థానం సంపాదించారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన నరేంద్రబాబు గారి మహిత్, పసల మోహిత్ లతో పాటు తెలంగాణకు చెందిన వివాన్ శరద్ మహేశ్వరి ఈ ఘనత సాధించి తెలుగు రాష్ట్రాలకు గర్వకారణంగా నిలిచారు. ఎస్సీ కేటగిరిలో ఏపీకి చెందిన దేవ శ్రీవేద్ టాపర్ గా నిలిచాడు.నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) ఈ ఏడాది జనవరి 21 నుంచి 29 వరకు జేఈఈ మెయిన్స్ మొదటి సెషన్ పరీక్షలను నిర్వహించింది. ఈ పరీక్షలకు దేశవ్యాప్తంగా మొత్తం 13,55,293 మంది విద్యార్థులు రిజిస్టర్ చేసుకోగా, వారిలో 13,04,653 మంది (96.26%) హాజరయ్యారు. సోమవారం విడుదల చేసిన ఫలితాల్లో బీఈ/బీటెక్ (పేపర్ 1) విభాగంలో 12 మంది విద్యార్థులు నూటికి నూరు శాతం మార్కులతో అగ్రస్థానంలో నిలిచారు. అయితే, ఈ 12 మందిలో ఒక్క మహిళా అభ్యర్థి కూడా లేకపోవడం గమనార్హం. అత్యధికంగా రాజస్థాన్ నుంచి ముగ్గురు విద్యార్థులు టాపర్లుగా నిలిచారు. మహిళల విభాగంలో హర్యానాకు చెందిన అషి గ్రేవాల్ 99.9969766 పర్సంటైల్‌తో అగ్రస్థానంలో నిలిచింది. విద్యార్థులు తమ అప్లికేషన్ నంబర్, పుట్టినతేదీ వివరాలను ఉపయోగించి అధికారిక వెబ్‌సైట్లయిన jeemain.nta.nic.in మరియు nta.ac.in నుంచి తమ స్కోర్ కార్డులను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. నార్మలైజేషన్ పద్ధతి ద్వారా తుది పర్సంటైల్‌ను లెక్కించినట్లు ఎన్టీఏ వెల్లడించింది.

ఈ సెషన్‌లో ఆశించిన స్కోరు రాని విద్యార్థులు నిరాశ చెందాల్సిన అవసరం లేదని, ఏప్రిల్ 2026లో జరగనున్న రెండో సెషన్ పరీక్షలకు హాజరై తమ ప్రతిభను మెరుగుపరుచుకోవచ్చని ఎన్టీఏ సూచించింది. రెండో సెషన్‌కు రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఇప్పటికే ప్రారంభమైంది. జేఈఈ మెయిన్స్‌లో మంచి స్కోరు సాధించిన విద్యార్థులు జేఈఈ అడ్వాన్స్‌డ్‌కు అర్హత సాధిస్తారు. దీని ద్వారా దేశంలోని ప్రతిష్ఠాత్మక ఐఐటీలలో ప్రవేశాలు పొందే అవకాశం ఉంటుంది. మిగిలిన వారు ఎన్ఐటీలు, ట్రిపుల్ ఐటీలు, ఇతర కేంద్ర ప్రభుత్వ విద్యా సంస్థల్లో అడ్మిషన్ల కోసం దరఖాస్తు చేసుకోవచ్చు.

మానవాళి పురోగతికి ఏఐ

(మొదటి పేజీ తరువాయి)

ఫిబ్రవరి 20 వరకు ఐదు రోజుల పాటు ఈ సదస్సు కొనసాగుతుంది. ఫిబ్రవరి 19న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రారంభోపన్యాసం చేస్తారు. సమ్మిళిత, బాధ్యతాయుతమైన ఏఐపై భారత్ విజన్‌ను, ప్రపంచ దేశాల సహకారంపై ఆయన తన ప్రసంగంలో దిశానిర్దేశం చేయనున్నారు. ఈ సదస్సులో 20 దేశాల అధినేతలు, 60 మంది మంత్రులు, ఉప మంత్రులు పాల్గొంటున్నారు.ఈ సదస్సులో భాగంగా నిర్వహిస్తున్న 'ఏఐ ఫర్ ఆల్', 'ఏఐ బై హర్', 'యువ ఏఐ' పేర్లతో మూడు గ్లోబల్ ఇంపాక్ట్ ఛాలెంజ్‌లు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. ఈ ఛాలెంజ్‌లకు 60 దేశాల నుంచి 4,650కి పైగా అప్లికేషన్లు రావడం, బాధ్యతాయుత ఏఐ ఆవిష్కరణలలో భారత్ గ్లోబల్ హబ్‌గా ఎదుగుతోందనడానికి నిదర్శనంగా నిపుణులు పేర్కొంటున్నారు. వీటిలో ఫైనలిస్టులుగా ఎంపికైన 70 బృందాలు ఫిబ్రవరి 16, 17 తేదీల్లో భారత్ మండపం, సుష్మా స్వరాజ్ భవన్‌లలో తమ ఆవిష్కరణలను ప్రదర్శిస్తాయి.

ఇదే క్రమంలో, ఫిబ్రవరి 18న ఐఐటీ హైదరాబాద్ భాగస్వామ్యంతో 'ఏఐ, దాని ప్రభావం' అనే అంశంపై రీసెర్చ్ సింపోజియం జరుగుతుంది. ఈ కార్యక్రమానికి కేంద్ర ఐటీ శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్, ఎస్టోనియా అధ్యక్షుడు అలర్ కారిస్ హాజరవుతున్నారు. ఈ సింపోజియంలో ప్రపంచవ్యాప్తంగా ప్రఖ్యాత ఏఐ మార్గదర్శకులు, పరిశోధనా సంస్థలు పాల్గొని తమ అభిప్రాయాలను పంచుకోవడం జరుగుతుంది.

కేంద్ర నిధులపై దృష్టి పెట్టండి

(మొదటి పేజీ తరువాయి)

సమావేశంలో సి.ఎస్ మాట్లాడుతూ, కేంద్ర ప్రాయోజిత పథకాల నుండి రాష్ట్రానికి రావాల్సిన బకాయిలు, నిధులు మార్చి నెలాఖరులోగా సమీకరించుకునేందుకు ప్రణాళిక బద్ధంగా పనిచేయాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వ ఎస్ఎన్ఏ నిధులు, 15వ ఆర్థిక సంఘం గ్రాంట్స్, ఇతర పథకాల క్రింద రాష్ట్రానికి రావాల్సిన నిధులపై ప్రత్యేక దృష్టి సారించి, దీనిపై ఢిల్లీలో ఒక ప్రత్యేక అధికారిని నియమించుకొని సమన్వయం చేసుకోవాలని తెలిపారు. ఈ సందర్భంగా పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మున్సిపల్, విద్య, వైద్యారోగ్య,గిరిజన సంక్షేమ శాఖల వారీగా కేంద్రం నుంచి సుమారు 15 వేల కోట్ల రూపాయిలు రావాల్సి ఉందని, వీటిని సమీకరించుకొని రాష్ట్రంలోని పెండింగ్ పనులకు ఖర్చు చేయాలని సూచించారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా మార్చి 2, 3 తేదీల నుండి జూన్2వ తేదీ వరకు వివిధ అభివృద్ధి పనులపై వివిధ డిపార్టుమెంట్ల వారీగా 100 రోజుల కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయాలని సిఎస్ అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా గ్రామీణాభివృద్ధి, మున్సిపల్, హెల్త్, ఎడ్యుకేషన్ విభాగాలలో ఈ ప్రణాకను సమర్థవంతంగా అమలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. రాష్ట్రంలో ఇటీవల గ్రామపంచాయతీ, మున్సిపల్ లోకల్ బాడీస్ ఎన్నికలు ముగిసినందున ఎన్నికైన వార్డుమెంబర్లు, సర్పంచులు, మున్సిపల్ కౌన్సలర్స్, కార్పొరేటర్స్ తదితర ప్రజాప్రతినిధులకు అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుపై అవగాహన కల్పించేందుకు బాధ్యతతో కూడిన విధులు నిర్వర్తించేందుకు ఈ వందరోజుల కార్యాచరణ ప్రణాళిక(100 డేస్ యాక్షన్ ఎ÷-లాన్) ఉపకరిస్తుందని సిఎస్ తెలిపారు. గ్రామాల్లో,పట్టణాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలు, రోడ్ల మరమ్మతులు, రానున్న వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకొని తాగునీటి ఎద్దడి లేకుండాకు తగు చర్యలు, ఇతర మౌలిక సదుపాయాల కల్పనకు ఈ యాక్షన్ ఎ÷-లాన్ రూపొందించాలని సూచించారు. రానున్న కేబినెట్ సమావేశానికి సంబంధించిన ప్రతిపాదనలను రేపటిలోగా సమర్పించాలని సిఎస్ సూచించారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు వికాస్ రాజ్, సి.వీ.ఆనంద్, ముఖ్యమంత్రి ముఖ్య కార్యదర్శి శేషాద్రి, ముఖ్య కార్యదర్శులు సందీప్ సుల్తానియా, అహ్మద్ నదీమ్, ఎన్. శ్రీధర్, యోగితారాణా, కార్యదర్శులు క్రిస్టినా చొంగ్తు, టికె శ్రీదేవి, స్టీఫెన్ రవీంద్ర, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఏడింట 5 కార్పొరేషన్‌లు కాంగ్రెస్ కైవసం..

(మొదటి పేజీ తరువాయి)

మిగిలిన 25 హంగ్ ఏర్పడిన స్థానాల్లో 15 మున్సిపాల్టీలను కాంగ్రెస్ కైవసం చేసుకుంది. మరో 5 మున్సిపాల్టీల్లో బీఆర్ఎస్, 4 చోట్ల ఇండిపెండెంట్లు, మరోచోట ఫార్వర్డ్ బ్లాక్ పార్టీలు గెలుచుకున్నాయి. దీనితో కాంగ్రెస్‌పార్టీ గెలిచిన మొత్తం మున్సిపాల్టీల సంఖ్య 81కి చేరింది(ఫలితాల ప్రకటన రోజు కాంగ్రెస్ 66 చోట్ల పూర్తి మెజారిటీ సాధించిన విషయం తెలిసిందే).బీఆర్ఎస్ సంఖ్య 18కి పెరిగింది. (ఫలితాల రోజు పూర్తి మెజారిటీతో బీఆర్ఎస్ 13 చోట్ల గెలిచింది). అలాగే 7 కార్పొరేషన్లకు జరిగిన ఎన్నికల్లో ఐదింటిని కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుంది. కరీంనగర్‌లో బీజేపీ, కొత్తగూడెంలో సీపీఐ కార్పొరేషన్లను దక్కించుకున్నాయి. ఇండిపెండెంట్లు అదిలాబాద్, జమ్మికుంట, మహబూబాబాద్, భైంసా మున్సిపాల్టీలను గెలుచుకున్నారు. అయితే వీరంతా కాంగ్రెస్ మద్దతుతోనే గెలిచారు. వడ్డేపల్లి మున్సిపాల్టీలో ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ గుర్తుపై గెలిచిన వారందరూ కాంగ్రెస్‌లో చేరామని ప్రకటించినప్పటికి అధికారికంగా ఎన్నికల సంఘం వారిని గుర్తించలేదు. దాంతో వారు ఫార్వర్డ్ బ్లాక్ నుంచే గెలిచారని ప్రకటించింది. మున్సిపాల్టీల్లో ఉమ్మడి నల్లగొండ, ఖమ్మం, వరంగల్, అదిలాబాద్, మహబూబ్‌నగర్, కరీంనగర్, నిజామాబాద్ జిల్లాల్లో హస్తం హవా కొనసాగింది.

ఇక్కడ 80 శాతానికి పైగా చైర్మెన్ పదవులను ఆ పార్టీ దక్కించుకుంది. ఉమ్మడి రంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో బీఆర్ఎస్ గట్టి పోటీ ఇచ్చింది. మెదక్ జిల్లాలోని ఇంద్రేశం మున్సిపాల్టీలో కోరం లేక చైర్మెన్ ఎన్నిక వాయిదా పడింది. ఆ జిల్లాలో మిగిలిన 18 స్థానాల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్ చెరో 9 స్థానాలను దక్కించుకున్నాయి. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న సిరిసిల్ల మున్సిపాల్టీని ఆ పార్టీ కైవసం చేసుకుంది. రంగారెడ్డి జిల్లాలోని ఆమనగల్ మున్సిపాల్టీలో ఒక్క స్థానం దక్కిన కాంగ్రెస్‌కు చైర్మెన్ పీఠం దక్కింది. ఇక్కడ మొత్తం 15 వార్డులుండగా.. బీఆర్ఎస్ 8, బీజేపీ 6, కాంగ్రెస్ ఒక్క వార్డులో గెలిచింది. కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవిల ఎక్స్ అఫిషియో ఓట్లతో ఆ సంఖ్య మూడుకు చేరింది. వారికి బీజేపీ సభ్యులు మద్దతు పలకడంతో ఒక స్థానంలో గెలిచిన హస్తం అమనగల్‌ను హస్తగతం చేసుకుంది.

5 కార్పొరేషన్లలో 'హస్తం'

మున్సిపల్ కార్పొరేషన్లలోనూ హస్తం జోరు కొనసాగింది. రాష్ట్రంలోని 7 మున్సిపల్ కార్పొరేషన్లకు జరిగిన ఎన్నికల్లో 5 చోట్ల మేయర్ పదవిని కాంగ్రెస్ కైవసం చేసుకుంది. నిజామాబాద్ మేయర్‌గా ఉమారాణి, రామగుండం మేయర్‌గా మహంకాళి స్వామి, డిప్యూటీ మేయర్‌గా పాతిపల్లి ఎల్లయ్య, మంచిర్యాల మేయర్‌గా ధరణి మధుకర్, డిప్యూటీ మేయర్‌గా సల్ల రమ్య మహేశ్, మహబూబ్‌నగర్ మేయర్‌గా గుమల్ మమత, డిప్యూటీ మేయర్‌గా ఎం సురేందర్ రెడ్డి, నల్లగొండ మేయర్‌గా బుర్రి చైతన్య శ్రీనివాసరెడ్డి కాంగ్రెస్ పార్టీ నుంచి గెలుపొందారు. నిజామాబాద్, నల్లగొండ డిప్యూటీ మేయరుగా ఎంఐఎంకు చెందిన సల్మాతాహిన్ ఎండీ.అష్రఫ్‌అలీ గెలిచారు. కొత్తగూడెం, నిజామాబాద్, నల్లగొండ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ పదవులను ఏఐఎంఐఎం గెలుచుకుంది. కొత్తగూడెం మేయర్ పీఠాన్ని కాంగ్రెస్ మద్దతుతో సీపీఐ దక్కించుకుంది. ఆ పార్టీ కార్పొరేటర్ మూడ్ గణేశ్ మేయర్‌గా ప్రమాణస్వీకారం చేశారు. ఇక్కడ డిప్యూటీ మేయర్ పదవి కాంగ్రెస్‌కు చెందిన సిరిపురపు లలిత కుమారీకి దక్కింది. చివరి క్షణం వరకు ఉత్కంఠగా సాగిన కరీంనగర్ మేయర్, డిప్యూటీ మేయర్ పదవులు బీజేపీ వశమయ్యాయి. ఆ పార్టీకి చెందిన కొలగాని శ్రీనివాస్ మేయర్‌గా, వై.సునీల్ రావు డిప్యూటీ మేయర్‌గా ఎన్నికయ్యారు.

11 మున్సిపాల్టీల్లో ఎన్నిక వాయిదా

రాష్ట్రంలోని11 మున్సిపాల్టీల్లో వివిధ కారణాల వల్ల చైర్మెన్, వైస్ చైర్మెన్ ఎన్నిక వాయిదా పడింది. ఇల్లందు, సుల్తానాబాద్, ఇబ్రహీంపట్నం, కాగజ్‌నగర్, క్యాతనపల్లి, ఖానాపూర్, జహీరాబాద్, ఇంద్రేశం, డోర్నకల్, జనగామ, తొర్రూర్ మున్సిపాల్టీల్లో ఎన్నిక వాయిదా పడ్డట్టు ఎన్నికల సంఘం తెలిపింది. గతంలో ఈసీ ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం కోరం లేక పోవడం, లేదా మరే ఇతర కారణాల వల్ల 16న జరగాల్సిన ఎన్నిక వాయిదా పడితే ఆ మరుసటి రోజు 17న నిర్వహిస్తామని ప్రకటించింది. అయితే వాయిదా పడ్డ మున్సిపాల్టీల ఎన్నిక నిర్వహణ తేదీని ఇంకా అధికారికంగా ప్రకటించలేదు.రామగుండం, మంచిర్యాల, మహబూబ్ నగర్, నల్గొండలలో కాంగ్రెస్ పార్టీకి పూర్తి మెజారిటీ వచ్చింది. నిజామాబాద్ కార్పొరేషన్ బీజేపీకి అవకాశాలు ఉన్నప్పటికీ, మజ్లిస్ పార్టీ మద్దతుతో దీనిని కాంగ్రెస్ కైవసం చేసుకుంది.

అక్షరం ప్రజల పక్షం RNI NO: TELTEL/2023/87607

ఉద్యమ నాయకుడు కెసిఆర్ కు 72వ పుట్టినరోజు శుభాకాంక్షలు

పార్టీ ఆదేశిస్తే రంగయ్యపల్లి ఎంపిటిసి బరిలోకి దిగుతా..

బిఆర్ఎస్ నాయకుడు మిట్టపల్లి రాకేష్

భీమదేవరపల్లి/ఫిబ్రవరి 16 (జర్నలిస్ట్ వార్త): తెలంగాణ ఉద్యమంలో ఎన్నో అవరోధాలను దాటుకుని, ప్రాణాలను కూడా లెక్కచేయకుండా పోరాడి ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించిన ఉద్యమ నాయకుడు, బిఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర రావు కు 72వ జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తున్నామని బిఆర్ఎస్ నాయకుడు మిట్టపల్లి రాకేష్ పేర్కొన్నారు. హుస్నాబాద్ నియోజకవర్గంలోని భీమదేవరపల్లి మండలం ముల్కనూర్‌లో సోమవారం రాకేష్ మాట్లాడారు. పార్టీ నిర్వహిస్తున్న అన్ని కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ, పార్టీ నిర్ణయాన్ని గౌరవిస్తూ ముందుకు సాగుతున్నానని తెలిపారు. పార్టీ ఆదేశిస్తే రంగయ్యపల్లిరాంనగర్ ఎంపిటిసి స్థానం నుంచి బరిలోకి దిగేందుకు సిద్ధంగా ఉన్నానని స్పష్టం చేశారు. మండల స్థాయి పార్టీ నాయకత్వం తనకు సహకరించి, గ్రామాభివృద్ధి దిశగా కలిసి పని చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఉద్యమ స్ఫూర్తిని కొనసాగిస్తూ ప్రజల సమస్యల పరిష్కారానికి కట్టుబడి ఉంటామని మిట్టపల్లి రాకేష్ పేర్కొన్నారు.

బయ్యారం వ్యవసాయ విస్తరణ అధికారిగా రెడ్యా నియామకం.

బయ్యారం/ఫిబ్రవరి 16(జర్నలిస్ట్ వార్త);
బయ్యారం రెవిన్యూ లోని క్లస్టర్ గా వ్యవసాయ విస్తరణ అధికారిగా బి.రెడ్యా ని నియమించినట్లు మండల వ్యవసాయ అధికారి కే.రాజు ఒక ప్రకటనలో తెలిపారు. బయ్యారం క్లస్టర్ రైతులకు సేవలు అందించనున్నట్లు తెలిపారు.బయ్యారం రైతు సోదరులు వ్యవసాయానికి సంబంధించిన సేవల కోసం ఏఈఓ రెడ్యా ని సంప్రదించాలన్నారు.సంప్రదించవలసిన ఫోన్ నెంబర్ 8977768200 ఈ ఫోన్ నంబరుకు కాల్ చేసి వ్యవసాయ సేవలు పొందాలన్నారు.

నర్సంపేటలో ఛత్రపతి శివాజీ విగ్రహ వాల్ పోస్టర్ విడుదల

శ్రీరామ్ దాల్ రాష్ట్ర అధ్యక్షుడు నంద్యాల వినయ్ రెడ్డి పిలుపు వేలాది మందితో ర్యాలీగా హాజరు కావాలని ఆహ్వానం

నర్సంపేట/ఫిబ్రవరి 16 (జర్నలిస్ట్ వార్త):
వరంగల్ జిల్లా నర్సంపేట పట్టణంలోని వరంగల్ రోడ్ చౌరస్తా కాకతీయ తోరణం వద్ద ఛత్రపతి శివాజీ మహారాజు విగ్రహ ఆవిష్కరణకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను ఘనంగా విడుదల చేశారు. ఈ కార్యక్రమానికి శ్రీరామ్ దాల్ రాష్ట్ర అధ్యక్షుడు నంద్యాల వినయ్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై పోస్టర్‌ను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఫిబ్రవరి 19, 2026 గురువారం రోజున మహబూబాబాద్ రోడ్డులోని అరవింద రైస్ మిల్ సమీపంలో ఛత్రపతి శివాజీ మహారాజు విగ్రహాన్ని ఘనంగా ఆవిష్కరించనున్నట్లు తెలిపారు. నర్సంపేట నియోజకవర్గం నుంచి ఐదు వేల మందితో ఉదయం 9.30 గంటలకు భారీ ర్యాలీగా బయలుదేరి

కార్యక్రమ స్థలానికి చేరుకుంటామని పేర్కొన్నారు.
దేశభక్తి, ధైర్యసాహసాలకు ప్రతీకగా నిలిచిన ఛత్రపతి శివాజీ మహారాజు స్ఫూర్తిని యువతలో నాటేందుకు ఈ విగ్రహ ప్రతిష్ఠ ఎంతో ఉపయుక్తమని ఆయన అన్నారు. సమాజంలో ఐక్యత, స్వాభిమానం, దేశసేవ భావాలను పెంపొందించే దిశగా ఈ కార్యక్రమం

సాగుతుందని స్పష్టం చేశారు.
ఈ కార్యక్రమంలో పోలిపాక విజయ్, ఊరూగొండ శివ, శ్రీనివాస్, మల్లారెడ్డి, దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

గౌరవ వేతనం గ్రామ సిబ్బందికే- వేలేరు సర్పంచ్ ఆదర్శ నిర్ణయం

వేలేరు/హనుమకొండ బ్యూరో, ఫిబ్రవరి 16 (జర్నలిస్ట్ వార్త):
వేలేరు మండలంలో అరుదైన ఆదర్శ ఘటన చోటుచేసుకుంది. మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు, వేలేరు మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ బిల్లా యాదగిరి తన పదవీకాలంలో పొందే గౌరవ వేతనాన్ని పూర్తిగా గ్రామపంచాయతీ సిబ్బందికే అంకితం చేస్తున్నట్లు ప్రకటించి అందరినీ ఆశ్చర్యానికి గురిచేశారు.
ప్రజాప్రతినిధిగా ఐదేళ్ల కాలంలో నెలకు రూ. 6,500 చొప్పున అందే మొత్తం రూ. 3,90,000లను గ్రామ పరిశుభ్రత కోసం శ్రమిస్తున్న సిబ్బందికి అందజేస్తానని ఆయన వెల్లడించారు. "గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచే చేతులే నిజమైన బలం" అంటూ యాదగిరి భావోద్వేగంగా మాట్లాడిన తీరు సభలో హర్షధ్వానాలు రేపింది.వర్షం, ఎండలు లెక్కచేయకుండా తెల్లవారుజామునే పనిలో నిమగ్నమయ్యే సిబ్బంది కష్టాన్ని సమాజం గుర్తించాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన తెలిపారు. గ్రామ పరిశుభ్రతే అభివృద్ధికి పునాది అని, సిబ్బంది ఉత్సాహం పెరిగితే గ్రామం మరింత ముందుకు సాగుతుందని విశ్వాసం వ్యక్తం

చేశారు.గ్రామాభివృద్ధి కేవలం మాటల్లో కాదు, చేతల్లో చూపాలనే సంకల్పంతోనే ఈ ముందడుగు వేసినట్లు సర్పంచ్ స్పష్టం చేశారు. ప్రజల విశ్వాసమే తనకు పెద్ద బలం అని, ఆ విశ్వాసాన్ని నిలబెట్టుకోవడం తన బాధ్యతగా భావిస్తున్నట్లు పేర్కొన్నారు.
ఈ నిర్ణయంతో గ్రామపంచాయతీ సిబ్బందిలో ఆనందం వెల్లివిరిసింది. తమ సేవలకు గౌరవం లభించిందని భావించి యాదగిరికి కృతజ్ఞతలు తెలిపారు. గ్రామ ప్రజలు కూడా ఈ చర్యను ప్రశంసిస్తూ, ప్రజాసేవకు అంకితమైన నాయకత్వానికి ఇదొక నిదర్శనమని అభినందిస్తున్నారు.
ప్రజాప్రతినిధి వేతనాన్ని సిబ్బందికే అంకితం చేసిన ఈ చర్య ఇతరులకు సైతం ఆదర్శంగా నిలవాలని స్థానికులు ఆకాంక్షిస్తున్నారు.

నర్సంపేట మునిసిపల్ నూతన పాలకవర్గానికి ఎమ్మెల్యే శుభాకాంక్షలు

చైర్మన్‌గా పెండెం శ్రీ లక్ష్మీ రామానంద్, ఉప చైర్మన్‌గా గంధం నరేందర్ ఎన్నిక

నర్సంపేట/ఫిబ్రవరి 16 (జర్నలిస్ట్ వార్త):
నర్సంపేట మున్సిపాలిటీ నూతన పాలకవర్గ ఎన్నికలు నిర్వహించగా, కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి నూతనంగా ఎన్నికైన సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు.
మునిసిపల్ చైర్మన్‌గా ఎన్నికైన పెండెం శ్రీ లక్ష్మీ రామానంద్‌కు, ఉప చైర్మన్‌గా ఎన్నికైన గంధం నరేందర్‌కు అభినందనలు తెలియజేసిన ఎమ్మెల్యే, మిగతా సభ్యులందరికీ కూడా విజయ శుభాకాంక్షలు తెలిపారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టే విధంగా బాధ్యతలు నిర్వర్తించాలని ఆకాంక్షించారు.
ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ,

పాలకవర్గం ప్రజల పక్షాన నిలిచి పట్టణ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించాలని కోరారు. ఇందిరమ్మ ప్రజా ప్రభుత్వంలో పార్టీలకు అతీతంగా, ఎలాంటి పక్షపాతం లేకుండా అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రతి అర్హులైన పౌరుడికి చేరేలా కృషి చేయాలని సూచించారు.

పట్టణంలో మౌలిక వసతుల విస్తరణ, శుభ్రత, తాగునీటి సరఫరా, రహదారుల అభివృద్ధి వంటి అంశాలకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు.
నూతన పాలకవర్గం సమిష్టి కృషితో నర్సంపేట పట్టణాన్ని ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు.

కొండూరి అక్కమ్మ భౌతిక కాయానికి నివాళులర్పించిన మాజీ సొసైటీ చైర్మన్.

బయ్యారం/ఫిబ్రవరి 16(జర్నలిస్ట్ వార్త);
బయ్యారం మండల కేంద్రానికి చెందిన కొండూరి రవికుమార్ మతృమూర్తి అక్కమ్మ అనారోగ్యంతో సోమవారం మృతిచెందారు.విషయం తెలుసుకున్న బయ్యారం సోసైటీ మాజీ చైర్మన్ మూల మధుకర్ రెడ్డి,సొసైటీ మాజీ డైరెక్టర్ తిరుమల ప్రభాకర్ రెడ్డి,తిరుమల చంద్రారెడ్డి,వీరబోయిన సంపత్ యాదవ్ భౌతికకాయాన్ని సందర్శించి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.అక్కమ్మ కుమారుడు రవి కుమార్ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపి,అక్కమ్మ ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.

కోటగడ్డ కాకతీయుల శివాలయంలో శివపార్వతుల కల్యాణ మహోత్సవ వేడుకలు.

బయ్యారం/ఫిబ్రవరి 16(జర్నలిస్ట్ వార్త);
బయ్యారం మండలంలో ప్రసిద్ధిగాంచిన అతి పురాతన కంఠమహేశ్వర స్వామి దేవాలయంలో మహా శివరాత్రిని పురస్కరించుకొని శివ పార్వతుల కళ్యాణం ఆలయ ధర్మకర్త కుంజా బిక్షమయ్య ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు.అర్చకులు తీరుగరి యాదగిరి స్వామి చేతుల మీదుగా కళ్యాణం నిర్వహించారు.ఈ కళ్యాణంలో ఆలయ ధర్మకర్త కుంజా బిక్షమయ్య,భువనేశ్వరి దంపతులు,నూతక్కి రంజిత్ కుమార్, అన్నపూర్ణ,పసనాది వెంకన్న ధనలక్ష్మి, పసనాది రాజా శిరీష,సర్పంచ్ కాయం వరలక్ష్మి నర్సింహారావు దంపతులు, వంగురు నిఖిల్ దంపతులు,కామినేని రామాచారి దంపతులు,పర్షిక వీరస్వామి నవ్య దంపతులు,వట్టం బుచ్చిబాబు శ్రీమతి దంపతులు పిటల మీద కూర్చొని కళ్యాణం నిర్వహించారు.ఈ సందర్బంగా మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి సహకరించిన గ్రామ పెద్దలకు,గ్రామస్తులకు,ఆలయ నిర్వాహకులు కుంజా బిక్షమయ్య,భువనేశ్వరిలకు సహకరించిన అందరికి కృతజ్ఞతలు తెలిపారు.

ప్రసాద్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన ఉప సర్పంచ్ బాలశౌరి దంపతులు

కల్లూరు/ఫిబ్రవరి 15 (జర్నలిస్ట్ వార్త):
కల్లూరు మండలం నారాయణపురం గ్రామంలో తెలంగాణ రాష్ట్ర మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సోదరుడు పొంగులేటి ప్రసాద్ రెడ్డి నివాసంలో తల్లాడ మండలం లక్ష్మీపురం గ్రామ ఉప సర్పంచ్ బండి బాలశౌరి దంపతులు మర్యాదపూర్వకంగా కలిశారు.
ఈ సందర్భంగా మున్సిపాలిటీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని విజయానికి కృషి చేసిన ప్రసాద్ రెడ్డికి శుభాకాంక్షలు, కృతజ్ఞతలు తెలిపారు. ఇటీవల జరిగిన మున్సిపల్ కార్యక్రమాల విజయవంతమైన నిర్వహణకు ఆయన అందించిన సహకారం ప్రశంసనీయమని పేర్కొన్నారు.
అదేవిధంగా, కల్లూరు మున్సిపాలిటీ ప్రమాణ స్వీకార మహోత్సవానికి విచ్చేసి

ఆశీర్వదించాలని కోరారు. కల్లూరు మున్సిపాలిటీ తొలి వార్డు సభ్యురాలు స్వాతి భాస్కర్ రెడ్డి సహా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల విజయానికి కృషి చేసిన నాయకులు, కార్యకర్తలు, అభిమానులకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.ప్రజల మద్దతుతో అభివృద్ధి కార్యక్రమాలు మరింత వేగంగా కొనసాగుతాయని, ప్రజా సేవలో ముందుండి పనిచేస్తామని నాయకులు పేర్కొన్నారు.

సర్పంచ్ వేతనాన్ని జీపీ సిబ్బందికే కేటాయించిన బిల్లా యాదగిరి.

వేలేరు ఫిబ్రవరి 16 / (జర్నలిస్ట్ వార్త):వేలేరు మండలకేంద్రానికి చెందిన సర్పంచ్ బిల్లా యాదగిరి తనపదవికాలంలో ప్రభుత్వం నుండి వచ్చే గౌరవ వేతనాన్ని నెలకు రూ.6500/లు, మొత్తం ఐదు సంవత్సరాలుకు గాను రూ.3,90,000(మూడు లక్షల తొంభై వేల రూపాయలను గ్రామపంచాయతీ సిబ్బందికి సోమవారం గ్రామపంచాయతీ కార్యాలయంలో జీపీ సిబ్బంది సమక్షంలో ప్రకటించారు.ఈసందర్భంగా సర్పంచ్ బిల్లా యాదగిరి మాట్లాడుతూ గ్రామాన్ని అనునిత్యం పరిశుభ్రంగా ఉంచేందుకు శ్రమపడుతున్న వారిసేవలను గుర్తించి, వారు తమ విధినిర్వహణలో మరింత ఉత్సాహంతో పనిచేసేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. సర్పంచ్ యాదగిరి వేతనాన్ని తమకు కేటాయించడంతో గ్రామపంచాయతీ సిబ్బంది ముక్త కంఠం తో ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.కార్యక్రమంలో గ్రామపంచాయితీ కార్యదర్శి రవీందర్,కారోబార్ లు కళ్యాణ్, సాంబయ్య, తదితర సిబ్బంది పాల్గొన్నారు.

నిరుపేదల ఆదరణే జికే ఫౌండేషన్ ధ్యేయం

చైర్మన్ గారే వెంకటేష్ మాదిగ

రాయపర్తి/ఫిబ్రవరి 16 (జర్నలిస్ట్ వార్త):
నిరుపేదలను ఆదుకోవడమే జికే ఫౌండేషన్ ప్రధాన లక్ష్యమని ఫౌండేషన్ ఛైర్మన్, తెలంగాణ మాదిగ పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షులు గారే వెంకటేష్ మాదిగ పేర్కొన్నారు. కష్టకాలంలో తోడుగా నిలవడం సామాజిక బాధ్యతగా భావిస్తున్నామని ఆయన స్పష్టం చేశారు.
మండల కేంద్రంలోని అంబేద్కర్ కాలనీకి చెందిన ఐత కుమార్ తల్లి ఐత లక్ష్మీ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా, సోమవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా జికే ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ. 5,000 ఆర్థిక సహాయం అందజేసి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో సమాజం ముందుకు రావాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జికే ఫౌండేషన్ డైరెక్టర్ గారే సందీప్, వార్డు సభ్యుడు గారే యాకుబ్, గారే శ్రీనివాస్, ఐత సంపత్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు. బాధిత కుటుంబానికి అన్ని విధాల సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.ది

కల్లూరులో హస్తం జెండా ఎగురేసింది

చైర్మన్‌గా దరావత్ మోహన్ నాయక్ ఉప చైర్మన్‌గా శీలం కోటేశ్వరి

కల్లూరు/ఫిబ్రవరి 16 (జర్నలిస్ట్ వార్త):
కల్లూరు మున్సిపాలిటీలో నెలకొన్న రాజకీయ ఉత్కంఠకు సోమవారం తెరపడింది. చైర్మన్, ఉప చైర్మన్ ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా పూర్తై, కాంగ్రెస్ పార్టీ పీఠాన్ని కైవసం చేసుకుంది. 20 వార్డులకు చెందిన కౌన్సిలర్లు తమ ఓటు హక్కును వినియోగించి నూతన పాలకవర్గాన్ని ఎన్నుకున్నారు. చైర్మన్‌గా దరావత్ మోహన్ నాయక్, ఉప చైర్మన్‌గా శీలం కోటేశ్వరి మెజారిటీ మద్దతుతో ఎన్నికయ్యారు. ఫలితాలు వెలువడగానే కాంగ్రెస్ శ్రేణుల్లో ఆనందోత్సాహాలు వెల్లివిరిశాయి. ఎన్నికల అనంతరం కాంగ్రెస్ పార్టీ నాయకులు నూతన చైర్మన్, ఉప చైర్మన్‌లను శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పొంగులేటి ప్రసాద్ రెడ్డి, కల్లూరు మార్కెట్ కమిటీ చైర్మన్ భాగం నీరజ, తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు పసుమర్తి చందర్రావు, జక్కంపూడి కిషోర్, రమేష్, సామినేని రామ్ అప్పారావు, దున్నేటి వీరారెడ్డి, పొట్టేటి జనార్దన్ రెడ్డి, బండి బాలశౌరి తదితరులు పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీగా హాజరై నూతన పాలకవర్గానికి అభినందనలు తెలియజేశారు. పట్టణ అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తామని, ప్రజల ఆశయాలను నెరవేర్చేందుకు సమిష్టిగా కృషి చేస్తామని నూతన చైర్మన్, ఉప చైర్మన్‌లు స్పష్టం చేశారు.

మంత్రివర్యుల సోదరుని మర్యాదపూర్వకంగా

కలిసిన జర్నలిస్ట్ వార్త ప్రతినిధి

కల్లూరు/ఫిబ్రవరి 16 (జర్నలిస్ట్ వార్త):
కల్లూరు మండలం నారాయణపురం గ్రామంలో తెలంగాణ రాష్ట్ర మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సోదరుడు పొంగులేటి ప్రసాద్ రెడ్డి నివాసంలో ఖమ్మం జిల్లా "జర్నలిస్ట వార్త" సిబ్బంది ప్రతినిధి నారపోగు ప్రసాద్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పరస్పర శుభాకాంక్షలు తెలియజేసుకుంటూ ప్రాంతీయ అభివృద్ధి అంశాలపై చర్చించారు. కల్లూరు మున్సిపాలిటీ పరిధిలో నిర్వహించిన ప్రచార కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని, పార్టీ అభ్యర్థుల విజయానికి కృషి చేసిన ప్రసాద్ రెడ్డికి స్థానిక ప్రజాప్రతినిధులు అభినందనలు తెలిపారు. ముఖ్యంగా మున్సిపాలిటీ చైర్మన్, ఉప చైర్మన్ అభ్యర్థుల విజయానికి అందించిన సహకారానికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన వారు, ప్రజల విశ్వాసమే నిజమైన బలం అని పేర్కొంటూ, అభివృద్ధి కార్యక్రమాలు నిరంతరం కొనసాగాలని ఆకాంక్షించారు. ప్రజల సహకారంతో కల్లూరు ప్రాంతం మరింత అభివృద్ధి చెందాలని ఆశాభావం వ్యక్తం చేశారు.

ముల్కనూర్‌లో లారీ స్కూల్ బస్సు ఢీ

తృటిలో తప్పిన పెను ప్రమాదం

భీమదేవరపల్లి/ఫిబ్రవరి16 (జర్నలిస్ట్ వార్త):
హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ముల్కనూర్ గ్రామంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద సోమవారం ఉదయం లారీ మరియు స్కూల్ బస్సు ఢీకొన్న ప్రమాదం చోటుచేసుకుంది. ప్రమాద సమయంలో బస్సులో 50 మందికి పైగా విద్యార్థులు ఉండగా అదృష్టవశాత్తు పెద్ద ప్రమాదం తప్పింది. ప్రమాదంలో ఇద్దరు విద్యార్థులకు స్వల్ప గాయాలు కాగా, వారిని స్థానికంగా చికిత్స అందించారు. మిగతా విద్యార్థులు సురక్షితంగా బయటపడ్డారు. ఘటనపై కన్నబోయిన తిరుపతి ఫిర్యాదు మేరకు లారీ డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ముల్కనూర్ ఎస్సై రాజు తెలిపారు. ఈ ఘటనతో గ్రామంలో కొంతసేపు ఆందోళన వాతావరణం నెలకొంది.

విద్యార్థులు విజయపథంలో పయనించాలి

విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు లక్ష్య సాధనకు శ్రమించాలి -ఘనంగా న్యూ సాంగ్ పాఠశాల వార్షికోత్సవం

సత్తుపల్లి/ఫిబ్రవరి 16 (జర్నలిస్ట్ వార్త):
విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకొని విజయపథంలో ముందుకు సాగాలని సత్తుపల్లి మండల విద్యాశాఖ అధికారి రాజేశ్వరరావు సూచించారు. సత్తుపల్లి మండలంలోని రేజర్ల గ్రామంలో ఉన్న న్యూ సాంగ్ స్కూల్లో వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులకు మార్గదర్శనం చేశారు.
ఈ వేడుకలకు 18 గ్రామాల నుంచి విద్యార్థులు, తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు, విద్యాభిమానులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. కార్యక్రమం ప్రార్థనతో ప్రారంభమై, విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలతో ఆకట్టుకుంది.
ముఖ్య అతిథి మాట్లాడుతూ చదువుతో పాటు బాధ్యతాభావం, నైతిక విలువలు, మానవతా దృక్పథం పెంపొందించుకోవాలని సూచించారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కలిసి పనిచేసినప్పుడే పిల్లలు ఉన్నత శిఖరాలను అధిరోహించగలరని అన్నారు. విద్యే ఉజ్వల భవిష్యత్తుకు మార్గమని, క్రమశిక్షణతో శ్రమిస్తే లక్ష్యాలు సులభంగా సాధ్యమవుతాయని పేర్కొన్నారు.
సత్తుపల్లి విభాగ ప్రైవేట్ పాఠశాలల సంఘం అధ్యక్షులు,శ్రీ ప్రతినిధి పసుపులేటి నాగేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులు సంస్కారం, సాంప్రదాయం, మర్యాదలను అలవరచుకోవాలని సూచించారు. చదువుతో పాటు వ్యక్తిత్వ వికాసం కూడా సమానంగా అవసరమని అన్నారు.
కార్యక్రమంలో ఆరోగ్య సేవకురాలు డాక్టర్ సత్యసాయి, న్యాయవాది నాగ పుష్పావతి, గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు. పాఠశాల అధ్యక్షుడు జైదీప్ ముఖర్జీ, ప్రధానోపాధ్యాయురాలు సిల్వియా, నిర్వాహకుడు డాక్టర్ విక్టర్ ముఖర్జీ ఆధ్వర్యంలో వేడుకలు విజయవంతంగా నిర్వహించబడ్డాయి. విద్యార్థుల నృత్యాలు, నాటికలు సభికులను అలరించాయి.

వైరా,మధిర మున్సిపల్ పీఠాలు హస్తం కైవసం

ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సమక్షంలో ఎన్నికల ప్రక్రియ

వైరా/మధిర, ఫిబ్రవరి 16 (జర్నలిస్ట్ వార్త):
ఖమ్మం జిల్లాలో వైరా, మధిర మున్సిపాలిటీల్లో కాంగ్రెస్ పార్టీ తన ఆధిపత్యాన్ని చాటుకుంది. రెండు పట్టణాల్లోనూ చైర్మన్ పీఠాలు హస్తం ఖాతాలో చేరడంతో పార్టీ శ్రేణుల్లో ఆనందోత్సాహాలు వెల్లివిరిశాయి.వైరా మున్సిపల్ చైర్మన్‌గా డాక్టర్ కాపా చంద్రకళ ఎన్నికై బాధ్యతలు స్వీకరించారు. అనంతరం తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వైరా నియోజకవర్గ శాసనసభ్యులు మాలోతు రాందాస్ నాయక్, ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్, మాజీ అధ్యక్షులు పువ్వాల దుర్గాప్రసాద్ పాల్గొన్నారు. వైరా మున్సిపాలిటీ అభివృద్ధి బాధ్యత తనదేనని ఉప ముఖ్యమంత్రి స్పష్టం చేస్తూ, కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించిన ఓటర్లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.అదే విధంగా మధిర మున్సిపాలిటీలో కూడా కాంగ్రెస్ పార్టీ విజయం సాధించింది. చైర్‌పర్సన్‌గా సామినేని సుజాత, ఉప చైర్మన్‌గా కోన ధని కుమార్ ఎన్నికయ్యారు. ఎన్నికల ప్రక్రియలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పాల్గొని తన పదవి హక్కు ఓటును వినియోగించారు. ఎన్నికల అధికారి ఆధ్వర్యంలో జరిగిన ప్రమాణ స్వీకార కార్యక్రమం ఘనంగా సాగింది.ఎన్నికలకు ముందు మధిరలోని తన శిబిర కార్యాలయంలో నూతనంగా గెలిచిన కౌన్సిలర్లను భట్టి విక్రమార్క అభినందించారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ పట్టణ అభివృద్ధికి అంకితభావంతో పనిచేయాలని సూచించారు. అనంతరం కౌన్సిలర్లతో కలిసి ఎన్నికల కార్యాలయానికి చేరుకుని ప్రక్రియలో పాల్గొన్నారు.ఎన్నికల అనంతరం మాట్లాడిన ఉప ముఖ్యమంత్రి, వైరామధిర మున్సిపాలిటీలను రాష్ట్రంలోనే ఆదర్శ పట్టణాలుగా తీర్చిదిద్దుతామని ధీమా వ్యక్తం చేశారు. సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికి చేరేలా చర్యలు తీసుకుంటామని, ప్రజలు కాంగ్రెస్ పార్టీపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయబోమని హామీ ఇచ్చారు. నూతనంగా ఎన్నికైన పాలకవర్గాలకు శుభాకాంక్షలు తెలియజేశారు.

నవవధూవరులను ఆశీర్వదించిన నూతన సర్పంచ్ దార రంజిత్

నర్సంపేట/ఫిబ్రవరి 16 (జర్నలిస్ట్ వార్త):
నర్సంపేట నియోజకవర్గంలోని చెన్నారావుపేట మండలం పరిధిలోని అమీనాబాద్ గ్రామ నూతన సర్పంచ్ దార రంజిత్, తన చిన్ననాటి స్నేహితుని సోదరి వివాహ వేడుకకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ప్రజాప్రతినిధిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత గ్రామంలో నిర్వహించిన ఈ కుటుంబ వేడుకలో ఆయన పాల్గొనడం స్థానికంగా విశేషంగా నిలిచింది.వివాహ కార్యక్రమం అనంతరం తన బాల్యమిత్రులతో ఆత్మీయంగా ముచ్చటించిన రంజిత్, చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. "ఎంతమంది స్నేహితులు వచ్చినా, చిన్ననాటి అనుబంధాలు ప్రత్యేకమే" అని పేర్కొంటూ పాత జ్ఞాపకాల్ని పంచుకున్నారు.తదనంతరం ఆయన మిత్రబృందం నూతన సర్పంచ్‌ను ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. గ్రామ అభివృద్ధికి కట్టుబడి పనిచేయాలని కోరుతూ తమ మద్దతు ఎప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు. కుటుంబ వాతావరణంలో సాగిన ఈ కార్యక్రమం ఆత్మీయతకు నిదర్శనంగా నిలిచింది.



ఆటో డ్రైవర్ నుంచి మేయర్ పీఠం వరకు

ప్రజాభిమానంతో గెలిచిన గణేష్!

కొత్తగూడెం/ఫిబ్రవరి 16 (జర్నలిస్ట్ వార్త):
సాధారణ ఆటో డ్రైవర్‌గా జీవితాన్ని ఆరంభించిన మూడు గణేష్ రాజకీయ ప్రస్థానంలో అరుదైన మైలురాయిని చేరుకున్నారు. ప్రజల మధ్యే పెరిగి, ప్రజలతోనే ముందుకు సాగిన ఆయన ఇప్పుడు కొత్తగూడెం నగరానికి తొలి మేయర్‌గా బాధ్యతలు స్వీకరించారు. కష్టనష్టాలను అధిగమిస్తూ సాధారణ స్థాయి నుంచి ప్రజా నాయకుడిగా ఎదిగిన గణేష్ విజయం స్థానిక రాజకీయాల్లో విశేష చర్చనీయాంశమైంది.ఎంపీటీసీగా తన రాజకీయ ప్రయాణాన్ని ప్రారంభించిన గణేష్, పదవిని అధికారంగా కాక సేవా వేదికగా భావించారు. పార్టీలకు అతీతంగా అభివృద్ధి పనులు చేపట్టి, ప్రజల సమస్యల పరిష్కారంలో చురుకుగా వ్యవహరించారు. తాగునీరు, కాల్వలు, రహదారులు, వీధిదీపాలు వంటి మౌలిక వసతుల అభివృద్ధిలో ఆయన కృషి విశేషంగా నిలిచింది. అందుకే ఆయనకు ఆ ప్రాంత ప్రజలు మన్ననలు కురిపిస్తూ మొప్పు ఇచ్చారు.కాంగ్రెస్‌సీపీఐ పొత్తులో భాగంగా 20వ డివిజన్ నుంచి కార్పొరేటర్‌గా పోటీ చేసిన గణేష్ ఘనవిజయం సాధించారు. ప్రజల విశ్వాసమే తన బలమని నిరూపించుకున్న ఆయనకు మేయర్ పదవి వరించింది. మున్సిపాలిటీ నుంచి కార్పొరేషన్‌గా రూపాంతరం చెందిన కొత్తగూడెం నగరానికి తొలి మేయర్‌గా ప్రమాణ స్వీకారం చేయడం ఆయన రాజకీయ జీవితంలో చారిత్రాత్మక ఘట్టంగా నిలిచింది.సాధారణ జీవితం నుంచి ప్రజా నాయకత్వ శిఖరానికి చేరుకున్న గణేష్ ప్రయాణం యువతకు స్ఫూర్తిదాయకం. "పదవి కాదు, సేవే ముఖ్యం" అన్న నమ్మకంతో ముందుకు సాగుతున్నానని మేయర్ గణేష్ స్పష్టం చేశారు. నగర అభివృద్ధి, పారదర్శక పాలన, ప్రజా సమస్యల శాశ్వత పరిష్కారం కోసం కట్టుబడి ఉంటానని ఆయన హామీ ఇచ్చారు.
ప్రజల ఆశలు, అంచనాలు తనపై ఉన్నాయని గుర్తించిన గణేష్, కొత్తగూడెం నగరాన్ని ఆదర్శ కార్పొరేషన్‌గా తీర్చిదిద్దే దిశగా అడుగులు వేస్తానని పేర్కొన్నారు. ఆటో డ్రైవర్‌గా ప్రారంభమైన ఈ ప్రయాణం ఇప్పుడు మేయర్ పీఠం వరకు చేరుకోవడం ప్రజాస్వామ్యంలో సాధ్యమైన విజయగాథగా నిలిచింది.

సంక్షేమ పథకాలు ప్రజల జీవితాల్లో మార్పు తేవాలి

ప్రొఫెసర్ కంచ ఐలయ్య
కేయూలో సరళీకరణ అనంతరం జనరంజక విధానాలు అనే అంశంపై జాతీయ సెమినార్.
ముఖ్య అతిథులుగా హాజరైన ప్రొఫెసర్ కోదండరాం, డాక్టర్ కె. శ్రీనివాస్
సెమినార్ సావనీర్‌ను ఆవిష్కరించిన ప్రముఖులు

హనుమకొండ బ్యూరో/ఫిబ్రవరి16 (జర్నలిస్ట్ వార్త): ప్రభుత్వాలు అమలు చేసే సంక్షేమ పథకాలు కేవలం ఓట్ల కోసమే కాకుండా, ప్రజల మౌలిక జీవితాల్లో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చేలా ఉండాలని ప్రముఖ సామాజిక తత్వవేత్త, ఓయూ రిటైర్డ్ ప్రొఫెసర్ కంచ ఐలయ్య అన్నారు. సోమవారం కాకతీయ విశ్వవిద్యాలయం రాజనీతి శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో సెనెట్ హాల్‌లో భారతదేశంలో సరళీకరణ అనంతరం జనరంజక విధానాలు అనే అంశంపై రెండు రోజుల జాతీయ సెమినార్ ఘనంగా ప్రారంభమైంది. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వి. రామచంద్రం అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో ఐలయ్య కీలక ఉపన్యాసం చేశారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ ఐలయ్య మాట్లాడుతూ కార్పొరేట్లకే పెద్దపీట.. పేదలకు మొండిచేయి చూపుతున్నారని తెలిపారు.

ఆర్థిక వ్యవస్థకు విదేశీ ఒప్పందాల ముప్పు

ఓయూ రిటైర్డ్ ప్రొఫెసర్ కోదండరాం..

ఓయూ రిటైర్డ్ ప్రొఫెసర్ కోదండరాం మాట్లాడుతూ.. అమెరికా, యూరప్ దేశాల కనుసన్నల్లో సాగుతున్న నూతన ఆర్థిక ఒప్పందాలు దేశ ప్రయోజనాలకు గొడ్డలిపెట్టుగా మారాయని హెచ్చరించారు. ఎగుమతులపై సుంకాలు లేకపోవడం, దిగుమతులపై భారీగా చెల్లింపులు చేయడం వల్ల దేశ ఆర్థిక వ్యవస్థ ప్రమాదంలో పడుతోందన్నారు. కేంద్రం పెత్తనం వల్ల రాష్ట్రాల్లో అభివృద్ధి కుంటుపడుతోందని, ఫెడరల్ వ్యవస్థ సంక్షోభంలో ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.

1991లో ప్రవేశపెట్టిన సరళీకరణ విధానాలు 90 శాతం మేర అగ్రవర్ణ పెట్టుబడిదారులకే మేలు చేశాయని విమర్శించారు. కేంద్ర బడ్జెట్‌లో 40 శాతం నిధులు కార్పొరేట్ శక్తులకే కేటాయిస్తున్నారని, పేదలకు ఉచిత విద్య, వైద్యం అందించడంలో ప్రభుత్వం వెనకడుగు వేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల్లో పెరుగుతున్న అసంతృప్తిని చల్లార్చుడానికే పాలకులు సంక్షేమ పథకాలను ఒక సాధనంగా వాడుకుంటున్నారని ఆయన పేర్కొన్నారు.

హక్కుగా మారిన సంక్షేమం డాక్టర్ కె. శ్రీనివాస్...

ప్రముఖ పత్రిక సంపాదకులు డాక్టర్ కె. శ్రీనివాస్ మాట్లాడుతూ గతంలో యూపీఏ ప్రభుత్వం ప్రవేశపెట్టిన వివిధ చట్టాల వల్ల సంక్షేమం అనేది ప్రజల హక్కుగా మారిందని, ప్రస్తుత మార్కెట్ విధానాల్లో ఆ పథకాలు ఒక్కొక్కటిగా బలహీనపడుతున్నాయని విమర్శించారు.

సెమినార్ సందర్భంగా పరిశోధకులు రాసిన వ్యాసాల సంకలనాన్ని (వాల్యూమ్) అతిథులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కేయూ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కె. ప్రతాపరెడ్డి, సోషల్ సైన్స్ డీన్ ప్రొఫెసర్ బి. సురేష్ లాల్.

రాజనీతి శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ సంకినేని వెంకటయ్య, బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్ డాక్టర్ గడ్డం కృష్ణయ్య, ప్రొఫెసర్ దినేష్ కుమార్, వీరన్న తదితరులు పాల్గొన్నారు.

వర్ధన్నపేట మున్సిపల్ పీఠం సారంగపాణి కైవసం

వైస్ చైర్మన్‌గా నేతవత్ శోభారాణి ఎన్నిక
చేతులెత్తి మద్దతు తెలిపిన కౌన్సిలర్లు..
పాల్గొన్న ఎమ్మెల్యే నాగరాజు
పట్టణంలో కాంగ్రెస్ శ్రేణుల భారీ విజయోత్సవ ర్యాలీ

మున్సిపల్ చైర్మన్గా పాలకుర్తి సారంగపాణి..

వైస్ చైర్మన్ గా...నేతవత్ శోభారాణి

వర్ధన్నపేట/ఫిబ్రవరి 16 (జర్నలిస్ట్ వార్త); వర్ధన్నపేట మున్సిపాలిటీ చైర్మన్ పీఠాన్ని పాలకుర్తి సారంగపాణి దక్కించుకున్నారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన ఎన్నికల ప్రక్రియలో ఆయన అత్యధిక మెజారిటీతో చైర్మన్‌గా ఎన్నికయ్యారు. వైస్ చైర్మన్‌గా నేతవత్ శోభారాణి బాధ్యతలు చేపట్టనున్నారు.

చైర్మన్ పదవికి పాలకుర్తి సారంగపాణి పేరును 6వ వార్డు కౌన్సిలర్ మాలోతు దేవేందర్ ప్రతిపాదించగా, ఒకటో వార్డు కౌన్సిలర్ బెజ్జం పాపారావు బలపరిచారు. ఈ సందర్భంగా కౌన్సిల్ సభ్యులు చేతులెత్తి తమ సంపూర్ణ మద్దతును తెలియజేశారు. సారంగపాణికి అనుకూలంగా మొత్తం 7 ఓట్లు వచ్చాయి. స్థానిక ఎమ్మెల్యే నాగరాజు ఓటింగ్ ప్రక్రియలో నేరుగా పాల్గొని సారంగపాణికి మద్దతు ప్రకటించడం విశేషం.

మున్సిపల్ వైస్ చైర్మన్‌గా నేతవత్ శిభారాణి ఎన్నికయ్యారు. ఆమె పేరును నునావత్ కమలి ప్రతిపాదించగా, కౌన్సిలర్ వాణి బలపరిచారు. మెజారిటీ సభ్యులు ఆమె వైపు మొగ్గు చూపడంతో ఎన్నిక లాంఛనమైంది. నూతనంగా ఎన్నికైన చైర్మన్, వైస్ చైర్మన్‌లను ఎమ్మెల్యే నాగరాజు ఇతర ముఖ్య నేతలు ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. పట్టణాభివృద్ధే లక్ష్యంగా అందరినీ కలుపుకుని పనిచేస్తాంమన్నారు ఈ సందర్భంగా.పాలకుర్తి సారంగపాణి, మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ నాపై నమ్మకంతో ఈ బాధ్యత అప్పగించిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నిక అనంతరం మున్సిపల్ కార్యాలయం వెలుపల పండుగ వాతావరణం నెలకొంది. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుండి వర్ధన్నపేట బస్టాండ్ సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహం వరకు కాంగ్రెస్ కార్యకర్తలు భారీ ర్యాలీ నిర్వహించారు. డీజే మోతలతో, కాంగ్రెస్ జిందాబాద్ నినాదాలతో పట్టణం హోరెత్తింది. కార్యకర్తలు బాణసంచా కాల్చి మిఠాయిలు పంచుకుంటూ సంబరాలు చేసుకున్నారు.

రోడ్డు మరమ్మతులు చేసిన పీచర సర్పంచ్ అనితనరసింహారావు.

వేలేరు/ఫిబ్రవరి 16 / (జర్నలిస్ట్ వార్త):వేలేరు మండలంలోని పీచర గ్రామశివారు లోని వేముల పల్లి నుండి కొండపూర్ వెళ్ళే రోడ్డు మార్గంలో ఇటీవలే కురిసిన మెంత తుపాన్ ప్రభావంతో రోడ్డు తెగిపోవడం వలన ఇదే దారిలో రైతులు వ్యవసాయ బావుల దగ్గరికి వెల్లడం ఇబ్బందీగా మారడంతో అక్కడి ప్రజలు గ్రామ సర్పంచ్ మరిజే అనిత నరసింహారావు దృష్టికి తీసుకురావడంతో స్పందించి సోమవారం రోడ్డును మొరం పోసి గుంతలు పూడ్చుడం జరిగింది.ఈ కార్యక్రమశీలో బిఆర్ఎస్ పార్టీ వేలేరు మండలఅధికార ప్రతినిధి మారబోయిన రాజుగౌడ్,గ్రామఉప సర్పంచ్ గుడికందుల,ప్రశాంత్,వార్డు సభ్యులు, గుడికందుల రాకేష్, ఒద్దుల శ్రీకాంత్, ఉప్పల శ్రీధర్ రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ రఘునాయకుల శ్రీధర్ రెడ్డి,బిఆర్ ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ఏలూరి కల్యాణ్, వేములపల్లి గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

వర్ధన్నపేట మున్సిపాలిటీ కాంగ్రెస్ కైవసం

చైర్మన్‌గా సారంగపాణి, వైస్ చైర్మన్‌గా శిభారాణి ఎన్నిక

ఘనంగా విజయోత్సవ ర్యాలీ.. హాజరైన ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు -అభివృద్ధికి పట్టం కట్టిన ప్రజలకు కృతజ్ఞతలు

వర్ధన్నపేట/ఫిబ్రవరి16(జర్నలిస్ట్ వార్త); వర్ధన్నపేట మున్సిపాలిటీ పీఠాన్ని కాంగ్రెస్ పార్టీ ఘనంగా కైవసం చేసుకుంది. సోమవారం నిర్వహించిన ఎన్నికలో మున్సిపల్ చైర్మన్‌గా పాలకుర్తి సారంగపాణి, వైస్ చైర్మన్‌గా నేతావత్ శిభారాణి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా పట్టణంలో కాంగ్రెస్ శ్రేణులు భారీ విజయోత్సవ ర్యాలీని నిర్వహించాయి. స్థానిక ఎమ్మెల్యే, కేఆర్ నాగరాజు ఈ వేడుకల్లో పాల్గొని నూతనంగా ఎన్నికైన చైర్మన్, వైస్ చైర్మన్ కౌన్సిలర్లను శాలువాలతో ఘనంగా సత్కరించారు.

అనంతరం మున్సిపల్ కార్యాలయం నుండి అంబేద్కర్ సెంటర్ వరకు నిర్వహించిన ఈ ర్యాలీలో పార్టీ కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. కాంగ్రెస్ జెండాలు చేతబూని, బాణాసంచా కాల్చుతూ పట్టణమంతా సందడి చేశారు. అనంతరం ఎమ్మెల్యే నాగరాజు బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. 6వ వార్డులో విజయం సాధించి ప్రమాణ స్వీకారం చేసిన కౌన్సిలర్‌ను ఈ సందర్భంగా ఆయన ప్రత్యేకంగా అభినందించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ ఈ విజయం కాంగ్రెస్ కార్యకర్తల కష్టానికి, క్రమశిక్షణకు దక్కిన ఫలితమని కొనియాడారు.ప్రజలు అభివృద్ధికి పట్టం కట్టారు. పారదర్శకమైన పాలన అందించడమే మా లక్ష్యం. కొందరు వెన్నుపోటు రాజకీయాలకు, అసత్య ప్రచారాలకు ఒడిగట్టినా.. ఓటర్లు వాటిని తిరస్కరించి కాంగ్రెస్‌పై నమ్మకాన్ని ఉంచారు. అధికార దుర్వినియోగం చేశామన్న ఆరోపణల్లో వాస్తవం లేదు, మేము ఎప్పుడూ రాజ్యాంగబద్ధంగానే నడుచుకుంటాంమని తెలిపారు. వర్ధన్నపేటను రాష్ట్రంలోనే ఆదర్శ మున్సిపాలిటీగా మార్చేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ గెలుపులో కీలక పాత్ర పోషించిన జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు వెంకటరామిరెడ్డి, ఆయూబ్ సహా మండల, పట్టణ నాయకులకు, యువజన, మహిళా విభాగాలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. మౌలిక వసతుల కల్పన, పేద వర్గాల సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.